క్లుప్తంగా

నేడు, రేపు పోలింగ్ స్టేషన్‌లలో ఉండాలి

కమలాపురం : మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో శని, ఆదివారం రోజుల్లో ప్రతి బీఎల్వో పోలింగ్ స్టేషన్‌లో అందుబాటులో ఉండాలని మండల తహసీల్దార్ సరస్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ సమ్మరి రివిజన్–2024లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బీఎల్వోలందరూ తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటు ఉండి ఫారం 6, 7, 8 తీసుకోవాలని ఆమె తెలిపారు. ఓటు హక్కు లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఓటరు జాబితా ప్రదర్శన

పెద్దముడియం : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద నేడు, రేపు ఓటరు జాబితా ప్రదర్శించబడుతుందని తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి తెలిపారు. గ్రామాల్లోని బీఎల్‌ఓలు అందరూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొత్త ఓటర్ లిస్ట్‌తో హాజరు కావాలని తెలిపారు. సదురు ఓటర్లు కొత్త ఓటరు లిస్టును పరిశీలించి సవరణలు, తొలగింపులు ఉన్నవారు అలాగే 18 సంవత్సరాలు పూర్తైన వారు తగిన ఆధారాలు బీఎల్‌ఓలకు ఇవ్వాలని తెలిపారు.

రుణ రికవరీ కోసం ఒత్తిడి

వల్లూరు : మండల కేంద్రమైన వల్లూరులోని ఎస్సీ కాలనీలో ఓ మైక్రో ఫైనాన్స్ సంస్థకు చెందిన ఏజంట్లు రుణ రికవరీ కోసం ఒత్తిడి చేశారు. స్థానికంగా వున్న కొందరు తీసుకున్న రుణాలకు సంబంధించి కంతులు ఖచ్చితంగా చెల్లించాలని శుక్రవారం ఒత్తిడి చేశారు. తమ దగ్గర ప్రస్తుతానికి డబ్బు లేదని, కొంత సమయం ఇస్తే చెల్లిస్తామని రుణం తీసుకున్న వారు అనడంతో తీసుకున్నపుడు చెప్పిన నిబందనల మేరకు డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేశారు. పోలీసులకు సమాచారం అందడంతో కానిస్టేబుల్ అక్కడికి చేరుకుని ఫైనాన్స్ సంస్థ ఏంజంట్లకు సర్దిచెప్పి పంపారు.

వై.కోడూరులో కళాజాత

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని వై.కోడూరులో మేలుకొలుపు అనే అంశంపై పోలీసులు మూఢాక్షలు మానండి అని నాటక రూపంలో కళాజాతను శుక్రవారం రాత్రి నిర్వహించారు. మూఢా క్షలతో కుటుంబాలు చిన్నభిన్నం అవుతాయని దాని వల్ల గ్రామంలో మనశాంతి దూరం అవుతుందని దాని వలన వచ్చే నష్టాలను నాటక రూపంలో వివరించారు. సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐ కృష్ణంరాజునాయక్‌లు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

కడప ఎడ్యుకేషన్: కడప సాలె నాగయ్యవీధిలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మను పాలిటెక్నిక్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో నవంబర్ 11వ తేదీన మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఆయన జీవిత విధానం, ఆయన చేసిన పోరాటాలు, సేవల గురించి విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలిచిన వారికి ఈ నెల 8వ తేదీన మను పాలిటెక్నిక్ కళాశాలలో డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజాద్‌బాషా చేతుల మీదుగా బహుమతులను అందజేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు.

యుద్ధభేరి మహాసభకు తరలిరండి

కడప సెవెన్‌రోడ్స్ : మాదిగ, రెల్లి, డొక్కలి, ఉపకులాల యుద్ధభేరి మహాసభ ఈనెల 30వ తేదీ విజయవాడ గాంధీనగర్ జింఖాన గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నారని, జిల్లాకు చెందిన మాదిగలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, జిల్లా అధ్యక్షులు శివ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమీపాన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు.

నేడు 'గడియారం'పై తపాలా కవరు ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హెడ్‌పోస్టాఫీసులో శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రముఖ కవి, అవధాని డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రిపై రూపొందించిన తపాలా కవరును ఆవిష్కరించనున్నట్లు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ (అడిషనల్ చార్జ్) రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి, అవధాని, సాహితీ రంగంలో విశిష్ట సేవలందించిన గడియారం ప్రొద్దుటూరుకు గర్వకారణమని, ఆయన కుటుంబీకులు తపాలాశాఖకు చేసుకున్న దరఖాస్తు మేరకు తపాలాశాఖ ఆమోదం పొంది ప్రత్యేక తపాలా కవరు విడుదల కానుండటం సంతోషదాయకమన్నారు. శనివారం నుంచి హెడ్ పోస్ట్ ఆఫీసులో కవర్లు విక్రయించనున్నట్లు ఆయన వివరించారు.

రేపు కెనాన్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్

కడప కల్చరల్ : ప్రముఖ ఫొటోగ్రఫీ సంస్థ కెనాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కడప నగర పరిధిలోని జయరాజ గార్డెన్స్‌లో ఉచిత ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి, కడప నగర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకర్‌రెడ్డి, కార్యదర్శి శివరామకృష్ణలు తెలిపారు. కడపలో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో మూడో వార్డులోని ప్రజల సమస్యలను ఆయన తెలుసుకుని పరిష్కరించారు. తమ కాలనీలోని కాలువల్లో పూడికలను సక్రమంగా తొలగించకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన వెంటనే మున్సిపల్ అధికారులతో చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వార్డులోఉన్న ప్రజలు సమస్యలుంటే తమదృష్టికి తీసుకు వస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గోపిరెడ్డి కొండారెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. న్యూరోసర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు వంటి ఒళ్లు నొప్పులకు చికిత్సలు అందించనున్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి మధ్యాహ్నం నుంచి గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హరిత ఆధ్వర్యంలో సరిగా నిద్రలేకపోవడం, ముందులాగ పనిచేయలేకపోవడం, తలనొప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం, భయంగా ఉండటం, ఆలోచనలు అదుపులో లేకపోవడం, మతిమరుపు, తదితర సమస్యలకు చికిత్సలు నిర్వహిస్తారన్నారు. అలాగే డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ 24 గంటలు ఆసుపత్రి నందు అందుబాటులో ఉంటారన్నారు. ఎండోస్కోపీ, కొలొనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివరు, ప్యాంక్రియాస్ కాన్సర్‌లకు ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. పులివెందుల ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మాకు న్యాయం చేయండి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధిత రైతులు

పులివెందుల రూరల్ / టౌన్ : పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం లోమడ గ్రామంలో మా భూమి మాకు ఇప్పించి మాకు న్యాయం చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో మోసపోయిన బాధిత రైతులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు దామోదర్, లోకనాథ్‌లు మాట్లాడుతూ లోమడ గ్రామంలో 6.47 సెంట్ల భూమిని మా తమ్ముడు వీరనారాయణ, భార్య విజయలక్ష్మి పేరు మీద నరేష్‌కుమార్, రాఘవరెడ్డి, తేజేశ్వర్‌రెడ్డిల పేరు మీద ఫోర్జరీ సంతకాలు చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారని వారన్నారు. మా తండ్రి వెంకట కొండయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారని, అందులో దామోదర్ పేరు మీద ఉన్న 6.47 ఎకరాల భూమిని ఆధార్‌కార్డులు మార్చుకుని భూమిని కాజేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రెవెన్యూ, సబ్ రిజిష్టర్ అధికారులు ఎలాంటి ఆధారాలు లేకుండా రిజిష్టర్ చేశారని వారు వాపోయారు. భాగపరిష్కారాలు చేసుకుని సర్వే నెం.7/5, 7/3, 7/2, 7/1, 5/6, 5/4 లో ఉన్న 6.47 ఎకరాల భూమిని మాకు ఇవ్వకుండా మోసం చేశారని వారు వాపోయారు. సంబంధిత అధికారుల చుట్టూ తిరిగినా మాకు న్యాయం జరుగలేదన్నారు. మా భూమి 4.74 సెంట్లు మునగకు పోయిందని, భూమికి వచ్చిన డబ్బులను, మిగిలిన భూమిని సమానంగా పంచాలని వారు కోరారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని వారు కోరారు. అంతేకాక మా తమ్ముని నుంచి మాకు ప్రాణహాని కూడా ఉందని వారు వాపోయారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్‌ఏఎస్ పరీక్ష


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ లిల్లెమ్మ

వల్లూరు : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా మండలంలోని విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల అంచనా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని 15 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులకు బదులుగా కడప శ్రీ హరి డిగ్రీ కళాశాలకు చెందిన 27 మంది విద్యార్థులను ఇన్విజిలేటర్లుగా నియమించి వారి ఆధ్వర్యంలో పరీక్షలను నిర్వహించారు. ఓఎంఆర్ షీట్‌లో విద్యార్థులు పరీక్షలను రాశారు. మండలంలోని వేదాస్ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, వల్లూరు జడ్పీ హైస్కూల్, గంగాయపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగిన పరీక్షలను ఎంఈఓ లిల్లెమ్మ, ఎంఈఓ 2 విజయ్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని 15 పాఠశాలలకు చెందిన 3, 6, 9 తరగతుల విద్యార్థులు మొత్తం 429 మంది పరీక్షలను రాసినట్లు ఎంఈఓ తెలిపారు.

పోటీపరీక్షల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలి


గోడ పత్రాలను విడుదల చేస్తున్న మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాదిక్

వీరపునాయునిపల్లె : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించే సైన్స్ పోటీపరీక్షల్లో విద్యార్థులు పాల్గొనేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి 1 జాఫర్ సాధిక్ తెలిపారు. శుక్రవారం పాయసంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన గోడ పత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. పోటీపరీక్షల్లో పాల్గొనడం వలన విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని, ఇటువంటి పరీక్షలు భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడతాయన్నారు.

ఎంఈఓ 2 అనిత మాట్లాడుతూ ప్రస్తు సమాజంలో మూఢ నమ్మకాల నిర్మూలన అవసరం ఎంతైనా ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు బేరిమోహన్ మాట్లాడుతూ నవంబర్ 10వ తేదీ పాఠశాల స్థాయి, 30వ తేదీ మండలస్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28వ తేదీన విశాఖపట్టనంలో రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పాయసంపల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో..

- కడప నుంచి కాశీకి ఐదు లక్షల శివలింగాలు
- తయారీలో రోజూ 300 మంది భక్తులు


సిద్ధం చేసిన చిట్టి శివలింగాలు

కడప కల్చరల్ : హరహర మహాదేవ శంభో....అన్న శివనామ స్మరణతో ఆ పరిసరాలు ప్రతిధ్వనిస్తున్నాయి. దాదాపు 300 మంది శివ భక్తులైన మహిళలు ఒకేచోట చేరి మట్టితో చిట్టిచిట్టి శివలింగాలను తయారు చేస్తున్నారు. వారిలో కొన్ని బృందాలు వాటికి తుది మెరుగులు దిద్దుతూ, ఆరబెడుతూ జాగ్రత్తగా ప్యాకింగ్ చేస్తుండడం కార్తీక మాసం రెండు వారాల ముందే వచ్చేసిన అనుభూతిని కలిగిస్తున్నది. కార్తీక మాసంలో పౌర్ణమి నాడు కాశీలో ఇలా రూపొందించిన కోటి చిన్న శివలింగాలతో విశేష పూజలు నిర్వహిస్తారని, దానికి ప్రధాని లాంటి ప్రముఖులు కూడా హాజరవుతారని తెలుస్తోంది. ఇందులో భాగంగా కడప, ప్రొద్దుటూరులోని ధార్మిక సంస్థలు భక్తులకు ఐదు లక్షల శివలింగాలు తయారు చేయాలని సూచించారు. ఈ ప్రాంతాలలో రోజూ దాదాపు 300 మంది మహిళలు దీన్ని ఓ యజ్ఞంగా భావించి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు శివలింగాలను రూపొందిస్తున్నారు.

ఒక్కొ శివలింగం బొటనవేలంత సైజులో ఉండేలా నల్లబంక మట్టితో నిర్వాహకులు ఇచ్చిన అచ్చుల ద్వారా తయారు చేస్తున్నారు. మట్టిని కూడా కాశీ నుంచి నిర్వాహకులే పంపడంతో స్థానిక భక్తులు దాన్ని నీటితో తడిపి, ఉండలు చేసి అచ్చు పోస్తున్నారు. అక్కడే మధ్యాహ్న భోజనం కూడా తయారు చేసుకుంటున్నారు. స్థానిక చిన్నచౌకులోని ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్‌లో ప్రస్తుతం ఈ తయారీ జరుగుతోంది. స్థానిక భక్తులు, బాలాజీ సేవా సమితి ప్రతినిధులు భారవి, విజయచంద్రారెడ్డి, రమాదేవి, అమరావతిల పర్యవేక్షణలో విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. తమకు కేటాయించిన ఐదు లక్షల శివలింగాలను పది రోజుల్లో సిద్ధం చేస్తామని వారు తెలియజేశారు.

బియ్యం పంపిణీలో వేగం పెంచాలి

కమలాపురం : ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో వేగం పెంచాలని ఆర్‌డీఓ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతినెల ఎండీయూ వాహన ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి రేషన్ బియ్యం పంపిణీ పై రివ్యూ నిర్వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి రోజుకు 100 కార్డుల చొప్పున బియ్యం పంపిణీ చేసేలా చూడాలన్నారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో బియ్యం పంపిణీ బాగా జరుగుతోందని, అయితే అన్ని గ్రామాల్లో కూడా ఇదే విధంగా బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ సరస్వతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

5న మహిళా సమాఖ్య కడప నగర మహాసభ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కడప నగర మూడవ మహాసభ ఆదివారం మృత్యుంజయ కుంటలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యురాలు వడ్ల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉమాదేవి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అందరికీ విద్య అందరికీ ఉపాధి లక్ష్యంగా భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించామని నగర అధ్యక్ష కార్యదర్శులు యస్.షాకిర్, డి. ఎం. ఓబులేసు తెలిపారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండులోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో మాజీ డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య , రామకృష్ణ నగర్ లో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు పతాకావిష్కరణ చేశారు. అనంతరం డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్, మాజీ కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి ,ఉద్యోగ పోరాట కమిటీ కన్వీనర్ సిద్దిక్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కడప ఎడ్యుకేషన్: జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు పౌష్టికాహారం లభిస్తుందని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషన్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్ బాషా అన్నారు. శుక్రవారం కడప నగరంలోని సాలే నాగయ్య ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సభ్యులు అలీ, షేర్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు డీఎంపై దాడి తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలోని ఏపీఎస్ ఆర్టీసీ తణుకు డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న గిరిధర్‌పై కత్తితో దాడి చేసి గాయపరచిన డిపో డ్రైవర్ నాగరాజు చర్యలను ఖండిస్తున్నామని ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కేకే కుమార్, ఎన్ రాజశేఖర్‌లు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ ఉ ద్యోగిగా ఇటువంటి దాడులు సమర్థనీయం కాదని, ఎన్ని సమస్యలున్నా చర్చలతో పరిష్కరించుకోవాలే తప్ప ఇలా భౌతిక దాడులకు దిగడం సరికాదన్నారు.

రూ. 50 వేలు విరాళం

కడప ఎడ్యుకేషన్: కడప డీఈఓ కార్యాలయ ఆవరణంలోని సరస్వతి దేవి ఆలయ నిర్మాణానికి పీఆర్ గవర్నమెంట్ హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పాలెం విజయలక్ష్మి రూ. 50 వేలు విరాళంగా ఇచ్చారు. ఇందుకుగాను శుక్రవారం డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తమ కార్యాలయంలో ఉపాధ్యాయురాలు పాలెం విజయలక్ష్మిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉత్తమ సమాజం

కడప ఎడ్యుకేషన్ / కడప కల్చరల్ : విలువలతో కూడిన విద్యతోనే ఉత్తమ సమాజం ఏర్పడగలదని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి అన్నారు. శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక స్పిరిట్స్ కళాశాలలో నైతిక విలువల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల డైరెక్టర్ రవీంద్రనాథ్, మానవతా జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సి.సుబ్బారెడ్డి , సంస్థ నగర కోశాధికారి డి.వీరారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాలకు చెందిన ఇద్దరు పేద విద్యార్థులకు రూ. 10 వేలు ఆర్థికసాయం చేశారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి


శిక్షణ పొందుతున్న మహిళలు

సింహాద్రిపురం : మహిళలు తమ స్వశక్తితో ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇప్పటికే పలు రకాల పథకాలను ప్రవేశపెట్టిందని, మహిళలు స్వశక్తితో ఆర్థికంగా కుటుంబ పోషణలో పాలుపంచుకుంటున్నారని పంచాయతీ సెక్రటరీ హరికిషోర్ తెలిపారు. ఇందులో భాగంగా గురిజాల గ్రామంలో శుక్రవారం లోమడ సోలార్ ప్లాంట్ సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ఉచితంగా కుట్టుమిషన్ల శిక్షణ ప్రారంభించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌ను అందించడంతోపాటు ఉపాధి కావాల్సిన మహిళలకు పులివెందుల గార్మెంట్‌లో ఉపాధి చూపిస్తారని ఆయన తెలిపారు. ట్రైనర్ టైలర్ 15 కుట్టుమిషన్లతో సుమారు 40 మంది మహిళలకు విడతల వారీగా శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వశక్తితో జీవించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఘనంగా మాజీ సర్పంచ్‌కు నివాళులు


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

వేంపల్లె : మండలంలోని గిడ్డంగివారిపల్లె గ్రామ మాజీ సర్పంచ్, శ్రీసాయి రజిత గ్యాస్ ఏజెన్సీ అధినేత్రి, జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి సతీమణి మాచిరెడ్డి రాధికరెడ్డి తృతీయ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆమె నివాస గృహంలో పలువురు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి, వైకాపా మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, వైకాపా రాష్ట్రనేత వేణుగోపాల్, ఎంపీపీ లక్ష్మిగాయత్రి, ఏపీఎండీసీ డైరెక్టర్ సల్మా, సివిల్ సప్లై సంస్థ డైరెక్టర్ షబ్బీర్‌వలి, హజ్ కమిటీ డైరెక్టర్ మునీర్, ఆయా ప్రజాప్రతినిధులతో పాటు విద్యుత్‌శాఖ ఓఎస్డీ శ్రీనివాసులు, ఎస్కే యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, వివిధ శాఖల అధికారులు రాధికరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం కల్పించిన మహిళా రిజర్వేషన్లలో దామాషా ప్రకారం బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలసి వినతి పత్రం ఇస్తామన్నారు. బీసీ జనగణనను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కేబినెట్‌లో నిర్ణయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ కృతజ్ఞతలు తెలియజేస్తోందన్నారు. గౌరవాధ్యక్షులు పి గురుస్వామి, కోశాధికారి శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ, రాష్ట్ర నాయకురాలు జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన గొరిగేనూరు విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో సర్పంచ్, ఉపాధ్యాయులు


పెద్దముడియం : పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జమ్మలమడుగు : మండలంలోని గొరిగేనూరు గ్రామానికి చెందిన విద్యార్థులు త్రోబాల్ పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎం.వసంత తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్టోబర్ 31వ తేదీ అన్నమయ్య జిల్లా నీలకంఠారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన త్రోబాల్ పోటీలలో తమపాఠశాలకు చెందిన ఆరు మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అండర్–14 విభాగంలో సి.మహేష్, వెంకటచరణ్, బాలికల విభాగంలో సుహాసిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్–17 విభాగంలో ఆర్.జగన్, బాలికల విభాగంలో బి.పద్మజ, డి.సంయుక్తలు ఎంపికయ్యారని వీరు అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ మత్తయ్య మాట్లాడుతూ గ్రామానికి చెందిన విద్యార్థులు క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పీడీ ఎర్రన్న, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెద్దముడియం : రాష్ట్రస్థాయి అండర్ 14 టేబుల్ టెన్నిస్ పోటీలకు మండలంలోని ఎస్.కొట్టాలపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ చౌడయ్య తెలిపారు. ఈ పోటీలలో పాఠశాలకు చెందిన జుబేదా, ప్రభావతి, షరీఫ్, సంపత్‌కుమార్, లక్ష్మి, సుజిత, నిర్మల, మొబీనా, ప్రవీణ్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ దస్తగిరిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు దారి ఖర్చుల నిమిత్తం పాఠశాల చైర్మన్ దస్తగిరిరెడ్డి రూ.5 వేలు నగదును అందజేశారు.

పెండ్లిమర్రి విద్యార్థులు ...

పెండ్లిమర్రి : మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు త్రోబాల్, టెన్నికాయిట్ నందు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఓ సావిత్రి దేవి, పీఈటీ శివశంకర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 31వ తేదీన నీలకంఠరావుపేట హైస్కూల్‌లో జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈపోటీలల్లో హైస్కూల్‌కు చెందిన కే.పవిత్ర, జి.ఉపేంద్ర, శివరామిరెడ్డిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 1వ తేదీన రాయచోటిలోని మాసాపేట హైస్కూల్‌లో జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో గంగనపల్లె హైస్కూల్‌కు చెందిన కే.గంగాదేవి, నందినిలు రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం , ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి, ఓం శాంతి సంస్థ ప్రతినిధి ప్రదీప అక్కయ్య తెలిపారు. శుక్రవారం కడప డీపీ టీఓ కార్యాలయంలో కేఎంపీఎల్ సాధించని, ప్రమాదాలు చేసే డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పంచసూత్రాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం పీజేడీఐ కృష్ణారెడ్డి, బద్వేలు సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ రామయ్య వారిని బస్సులో తీసుకెళ్లి రహదారిపై ఉండే సిగ్నల్స్, ఇంధన పొదుపుపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ డిపోలకు చెందిన 17 మంది డ్రైవర్లు, ముగ్గురు హయ్యర్ బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

డీఈఓపై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : డీఈఓ రాఘవరెడ్డి అవినీతి అ క్రమాలపై విచారణ జరిపిన అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేయడం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్‌కుమార్, రాజేంద్రప్రసాద్‌లు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అధికారుల వైఖరి ఇలాగే కొనసాగితే విద్యార్థి సంఘాలతో ఆందోళనలు చేపడతామన్నారు.